క్లుప్తంగా

ఘనంగా అడవిరాజులబాబు పండగ



దుచ్చరిపాలెంలో అడవి రాజులబాబు పండగలో పాల్గొన్న గిరిజనులు

గూడెంకొత్తవీధి: మండలంలోని రింతాడ పంచాయతీ దుచ్చరిపాలెంలో అడవి రాజుల బాబు పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏటా గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా ఈ పండగను జరుపుకోవడం ఆనవాయితీ. ఈ పండగను పురస్కరించుకొని గ్రామస్తులంతా కలిసి గ్రామ సమీపంలో తోటలోని ఓ చెట్టుకు పసుపు, కుంకుమ అద్ది ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువత విలువిద్య పోటీల్లో పాల్గొని సందడి చేశారు. సర్పంచ్ సాగిన పుష్పకుమారి, గ్రామపెద్దలు సాగిన రామరాజుపడాల్, వార్డు సభ్యులు జోగిపడాల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంతో పంటలకు ఉపయోగం



రైతులకు సూచనలిస్తున్న జగదాంబ

పాడేరు రూరల్: మండలంలోని రైతులకు జీవామృతం తయారీపై మంగళవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. మండల కేంద్రంలోని జరిగిన ఈ కార్యక్రమంలో డివిజనల్ మాస్టర్ ట్రైనర్ జగదాంబ మాట్లాడుతూ గిరిజన రైతులు ఆధునిక విధానాలతో వ్యవసాయ సాగు చేయాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగంతో భూసారం దెబ్బతింటుందన్నారు. ప్రకృతి సాగుపై దృష్టి సారించాలన్నారు. ఆవు మూత్రం, పేడ, వివిధ రకాల ఆకులతో తయారుచేసిన ఎరువులను వినియోగిస్తే పంటకు పోషకాలు పుష్కలంగా అందుతాయన్నారు. అధిక దిగుబడి వస్తుందన్నారు. గ్రామ స్థాయిలో రైతులకు విస్తృతంగా శిక్షణలు అందిస్తున్నామన్నారు. సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భూదాతల దీక్షలు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ పాఠశాల నిర్మాణానికి భూములు ఇచ్చిన భూ బాధితుల దీక్ష మంగళవారంతో 26వ రోజుకు చేరింది. బాధిత గిరిజనులు డొంబు, రాంచందర్‌లు మాట్లాడుతూ పాఠశాల కోసం భూములిచ్చిన బాధిత కుటుంబాలకు ఉపాధి కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చి ఏడేళ్లు కావస్తున్నా నేటి వరకు ఆదుకోలేదని, న్యాయం చేయాలని వారు కోరారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు తమకు న్యాయం చేసేంత వరకు ఆందోళన దీక్ష కొనసాగిస్తామన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



కొత్తసుజనకోటలో తాగునీటి బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ కొత్త సుజనకోట గ్రామంలో సమ్మర్ క్రాష్ కార్యక్రమంలో భాగంగా తాగునీటి బోరు మరమ్మతు పనులను ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్య నారాయణమూర్తి, ఏఈ రాజేష్‌ల పర్యవేక్షణలో మంగళవారం నిర్వహించారు. బోరు మెకానిక్ రాజేంద్ర బోరును బాగుచేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేష్ మాట్లాడుతూ సమ్మర్ క్రాష్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో పాడైన బోరులపై సమాచారం ఇస్తే మరమ్మతు చేయిస్తామన్నారు.

నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

వి.ఆర్.పురం: పోలవరం భూ నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించిన తరువాతే అన్ని సౌకర్యాలు ఉన్న పునరావాస కాలనీల్లో తరలించాలని సీపీఎం మండల కార్యదర్శి పులి సంతోష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం 41.15 కాంటూరు పరిధిలో ఉన్న గ్రామాలను పునరావాస కాలనీలకు తరలిస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. నిర్వాసితులకు కేటాయించిన కాలనీల్లో కనీస మౌలిక వసతులను కూటమి ప్రభుత్వం కల్పించలేదన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వసతి, వంటి సదుపాయాలు కల్పించకుండా నిర్వాసితులను తరలించడం సరికాదన్నారు. ప్రతి నిర్వాసితుడికి నష్టపరిహారం చెల్లించాలని, అర్హులందరికీ పునరావాసం కల్పించాలని, లేని పక్షంలో ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. నేతలు రాజులు, చినబాబు, శ్రీరామ్మూర్తి, సత్తిబాబు, లక్ష్మణరావు, బాబూరావు, రమేష్ పాల్గొన్నారు.

నాడు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టింది. రూ.కోట్లు వెచ్చించి కొత్త భవనాల నిర్మాణం, పాడైన వాటికి మరమ్మతులు చేపట్టారు. మెరుగైన సౌకర్యాలు కల్పించారు. చిన్నారుల విద్యపై గత సీఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించారు. పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టారు. ఇందుకు ప్రత్యేక పాఠ్యపుస్తకాలను, బోధన సామగ్రిని సమకూర్చారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు.

నేడు

ప్రస్తుత కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై కనీస దృష్టి సారించడంలేదు. చిన్నారులకు ప్రీ ప్రైమరీ విద్య కరవైంది. అరకొర వసతుల నడుమ.. శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ దారుణంగా సాగుతోంది. గత ప్రభుత్వం చేపట్టిన మరమ్మతులు, పునర్నిర్మాణ పనుల్ని.. ఈ ప్రభుత్వం కొనసాగించక, మూలకు చేర్చింది. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పాలిట శాపంగా మారింది.

అరకొర వసతులు ఇంకెన్నాళ్లీ అవస్థలు?

శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రాలు | అరకొర సౌకర్యాలు | గర్భిణులు, బాలింతలు, చిన్నారుల అవస్థలు | పట్టించుకోని యంత్రాంగం



అప్పలరాజుపేటలో శిథిల స్థితికి చేరిన అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పిచ్చిమొక్కలు

రాజవొమ్మంగిలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

అంగన్‌వాడీ కేంద్రాలు	సొంత భవనాలు	అద్దె భవనాల్లో	చిన్నారులు	
101	65	30	(0–6 నెలలు వయస్సున్నవారు)	256
			(6– ఏడాది వయస్సున్నవారు)	235
స్కూల్‌లో	గర్భిణులు	బాలింతలు	(ఏడాది–3సంవత్సరాలున్నవారు)	902
06	167	254	(3–6సంవత్సరాలవయస్సున్నవారు)	996



కన్నయిమ్మపేటలో నిరుపయోగంగా అంగన్‌వాడీ కేంద్రం

రాజవొమ్మంగి: కూటమి ప్రభుత్వ పాలనలో సమగ్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. మండలంలోని కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరగా.. మరికొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇరుకైన గదుల్లో.. ఆట స్థలం లేక.. ఆటలాడుకునేందుకు వస్తువులు లేక అరకొర సదుపాయాల నడుమ చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. రక్షణ గోడలు లేవు. శిథిలావస్థ భవనాల్లో ప్రమాదకర పరిస్థితులు దర్శనమిస్తున్నాయి.

శిథిలావస్థలో కొన్ని... అసంపూర్తిగా మరిన్ని

అప్పలరాజుపేటలోని అంగన్‌వాడీ కేంద్రం శిథిల స్థితికి చేరుకొని చుట్టూ అడవిని తలపించేలా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. రహదారి అధ్వానంగా మారింది. ఇదే తరహాలో మండలంలోని దూసరపాము, కొండపల్లి, మొల్లిమెట్ల, సింగంపల్లి, సూరంపాలెం, ఎస్.వరణకరాయి, జడ్డంగి–2, బోయపాడు, బడదనాంపల్లి, రాజవొమ్మంగి–1 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వర్షం పడితే సరకులు, రికార్డులు తడిసిపోతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి కొత్త భవనాలు నిర్మించాలని కోరుతున్నారు. మండలంలోని సింగంపల్లి, సూరంపాలెంతో పాటు పలు ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల ఫ్లోర్ లెవెల్, బేస్‌మెంట్ లెవెల్, శ్లాబ్ లెవెల్‌లో ఉన్నాయి. మరికొన్ని భవన నిర్మాణాలు పూర్తయినప్పటికీ ఫినిషింగ్ జరగకపోవడంతో అవి కూడా శిథిలస్థితికి చేరుకుంటున్నాయి.

నాడు ఘనం.. నేడు దయనీయం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులు విస్తృతంగా జరిగాయి. ఐదేళ్ల పాలనలో చాలా చోట్ల కొత్తగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం.. పాడైన భవనాల మరమ్మతు పనులు జరిగాయి. పూర్తి స్థాయిలో మరిన్ని పనులు చేపట్టేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో పనులన్నీ నిలిచిపోయాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలలు కావస్తున్నా ఆయా నిధులతో మన్యంలో ఒక్క అంగన్‌వాడీ భవనానికీ మరమ్మతులు చేసిన దాఖాలాల్లేవు. కనీస సౌకర్యాలూ కల్పించలేదు. చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువుల పంపిణీ ఆగిపోయింది. పౌష్టికాహార పంపిణీ సక్రమంగా జరగడం లేదు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గర్భిణుల, బాలింతలకు టేక్ హోం రేషన్, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా జరగడం లేదు. కూటమి ప్రభుత్వం ప్రీ ప్రైమరీ విద్యకు మంగళం పాడింది. కేంద్రాల్లో పాఠాలు చెప్పేందుకు సరైన సదుపాయాలు, వసతి లేక పిల్లలు నానా అవస్థలు పడుతున్నారు. అద్దె ఇళ్లల్లో కొనసాగుతున్న కేంద్రాల్లో కూడా కనీస సౌకర్యాలూ కరవే..!



ఆందోళనగా ఉంది

మా గ్రామంలో అంగన్‌వాడీ భవనం శిథిల స్థితికి చేరింది. ఓ అద్దె భవనంలో నిర్వహిస్తున్న కేంద్రంలో మా పిల్లలు చదువుతున్నారు. ఇంటి పరిసరాల్లో లోతైన పంటకాలువ ఉంది. ప్రహరీ లేక ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనం నిర్మించాలి.

– చిన్ని నూకరత్నం, గృహిణి, అప్పలరాజుపేట

ప్రతిపాదనలు పంపాం

మండలంలోని పలుచోట్ల పాడైన అంగన్‌వాడీ కేంద్రాల భవనాల మరమ్మతు పనులకు.. కొన్ని ప్రాంతాల్లోని శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలో కొత్తవి నిర్మించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను కూడా నివేదించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేస్తాం.

– దేవమణి, సీడీపీవో, రాజవొమ్మంగి

గ్రామాల్లో రైతుల వివరాల నమోదు



వెంకటనగరంలో రైతుల వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది

అడ్డతీగల: మండలంలోని వెంకటనగరంలో మండల వ్యవసాయాధికారి ఎం.సువర్ణకుమారి ఆధ్వర్యంలో ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతుల వివరాల నమోదు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కోసం కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య ఉన్న రైతులకు వ్యవసాయ పథకాలు సులభతరంగా అందుతాయన్నారు. పంటల బీమా, పంట నష్ట పరిహారం, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, వ్యవసాయ పరికరాలపై రాయితీలు వర్తిస్తాయన్నారు. ఇందుకోసం రైతు నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో నిర్వహిస్తున్న నమోదు ప్రక్రియలో భాగంగా రైతు పేరు, ఊరు, ఆధార్ నంబర్, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నెంబర్ తదితర వివరాలను అందించాలన్నారు. రైతులు సేవా కేంద్రానికి వెళ్లలేని పరిస్థితుల్లో సంబంధిత అధికారులకు సమాచారం అందజేస్తే ఓటీపీ ద్వారా నమోదు చేస్తారన్నారు.

పోడు పట్టాల కోసం ఆందోళన



నిరసన తెలుపుతున్న గిరిజనులు

రంపచోడవరం: పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ నాయకుడు, వినోద్‌మిశ్రా ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు కోసిరెడ్డి గణేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మంగళవారం జరిగిన కార్యక్రమంలో అడ్డతీగల మండలం కొత్తూరుపాడు, రాజవొమ్మంగి అటవీ రేంజ్ పరిధిలోని వీరభద్రపురం, దొరమామిడి పంచాయతీ కినపర్తికి చెందిన గిరిజన కుటుంబాలు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గణేశ్వరరావు మాట్లాడుతూ పట్టాల కోసం కోర్టును ఆశ్రయించగా ఆయా ప్రాంతాల్లో అర్హులైన గిరిజన కుటుంబాలకు పోడు పట్టాలు ఇవ్వాలని కోర్టు ఆదేశాలిచ్చిన అమలుకావడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి బాధిత గిరిజన రైతులకు న్యాయం చేయాలని కోరారు.

జడ్డంగి పాఠశాలలో ఆడిట్



పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలిస్తున్న అధికారులు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష అభియాన్ స్టేట్ రిసోర్స్ పర్సన్ సీహెచ్.రాజు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఆడిట్ నిర్వహించారు. పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకంలో ఆహార పదార్థాల నాణ్యత, ప్రమాణాలు, మెనూ అమలుతీరును పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. పాఠశాలలో ఆర్వో ప్లాంట్ పనిచేయకపోవడంతో సురక్షిత తాగునీరు అందడంలేనట్టు, తరగతి గదుల్లో గోడలకు రంగులు, పెయింటింగ్స్ లేనట్టు, ఫ్యాన్లు అవసరమున్నట్టు గుర్తించారు. ఉన్నతాధికారులకు సమస్యలు నివేదిస్తామని ఆడిట్ అధికారులు తెలిపారు. హెచ్‌ఎం రాజు, ఎస్‌ఎంసీ చైర్మన్ మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

వైభవంగా అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



సీకరి గంగదేవతకు పూజలు చేస్తున్న భక్తులు

పెదబయలు: మండలంలోని సీకరి గ్రామంలో గంగదేవత ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గంగదేవతను దర్శించుకునేందుకు పంచాయతీ పరిధిలో సుమారు 14 గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయా గ్రామాల పెద్దలను సన్మానించి, అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సాయంత్రం వివిధ సాంస్కృతి కార్యక్రమాలు జరిగింది. ఇందులో పలు గ్రామాలకు చెందిన యువత థింసా నృత్యాలు చేశారు. సీకరి సర్పంచ్ గుల్లేలు కృష్ణారావు, గ్రామ పెద్దలు సీనియర్ ఉపాధ్యాయులు సీకరి భీమలింగేశ్వరస్వామి, గంగపూజారి, లకే సింహాచలం, జగన్నాథం, సీకరి బాలకృష్ణ, జనార్ధన్, ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. వందలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారం

జి.మాడుగుల: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరికీ మద్దతుగా నాయకులు మంగళవారం ప్రచారం చేశారు. మండల కేంద్రంలోని పలు పాఠశాలల్లో నేతలు మురళీమోహన్, దేముడు, శ్రీను తదితరులు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలుచేయాలి



విద్యార్థినులతో కలసి అల్పాహారం భుజిస్తున్న జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ స్వామినాయుడు

చింతూరు: పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ స్వామినాయుడు సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులకు పలు సూచనలిచ్చారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థినులంతా కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థినులతో కలసి అల్పాహారం భుజించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలసి ఆయన మొక్కలను నాటారు. పాఠశాల ప్రత్యేకాధికారి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలపై అవగాహన తప్పనిసరి

కొయ్యూరు: పీసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలకు పీసా చట్టాల నియమావళి, అమలుతీరుపై జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇందులో భాగంగా కొయ్యూరులో జరిగిన కార్యక్రమంలో ఏపీ ఎస్ఐఆర్‌డీ డిప్యూటీ డైరెక్టర్ రామనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంపీడీవో ప్రసాద్ మాట్లాడుతూ శిక్షణలో తెలుసుకున్న అంశాలను మరువవద్దన్నారు.

అనంతగిరి(అరకులోయటౌన్): మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పీసా చట్టం అమలుపై శిక్షణ కార్యక్రమంలో కాశీపట్నం, జీనబాబు పంచాయతీ కార్యదర్శులు వై.రామస్వామి, సంతోషి నళిని, ఎన్‌జీవో సభ్యుడు రామచంద్రరావు పాల్గొని పీసా చట్టం ప్రాధాన్యత, నియమావళిపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో కుమార్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో మంగళవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో పీసా హక్కులు, చట్టాల వల్ల కలిగే ప్రయోజనాలను సామర్లకోట విస్తరణ కేంద్రం పర్యవేక్షకులు ప్రసాద్, శ్రీనివాసులు వివరించారు. శిక్షణ తరగతులను ప్రతి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు చిన్నాన్న, సింహాచలం, సత్యరంజన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

పెదబయలు: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య తెలిపారు. ఎంపీపీ వి.వరహాలమ్మ అధ్యక్షతన ఉదయం 10 గంటల నుంచి సమావేశం జరుగుతుందని, మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు రావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు విధిగా ప్రగతి నివేదికతో హాజరుకావాలని సూచించారు.

అరకు ఎంపీ తనూజారాణి ఔదార్యం

గోపాల్ కుటుంబానికి ఆర్థిక సాయం



గోపాల్ కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అరకులోయటౌన్: వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శిగా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన శెట్టి గోపాల్ కుటుంబానికి అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి ఆర్థిక సాయమందించారు. ఈ మేరకు ఎంపీ తనూజారాణి ఇచ్చిన నగదును మండల పార్టీ నాయకులు మంగళవారం మాదల గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబానికి అందజేశారు. పార్టీ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు ఎల్.బి.కిరణ్‌కుమార్, పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి నర్సింగరావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పాడి రమేష్, మాజీ సర్పంచ్ కె.సన్యాసి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఎం. రంజిత్ కుమార్, నాయకులు ఎం.బాలరాజు, నగేష్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



అనారోగ్యంతో బాధపడుతున్న నూకరత్నంకు ఆర్థిక సహాయం అందజేస్తున్న వెంకటరామకృష్ణ

రాజవొమ్మంగి: మండలంలోని చికిలింత గ్రామంలోని వాల్మీకినగర్‌లో ఉంటున్న జుర్రా నూకరత్నం అనారోగ్యంతో బాధపడుతుంది. ఆమెకు అన్నవాహిక శస్త్రచికిత్స చేయాల్సి ఉంది. ఈ విషయం తెలుసుకున్న కొంతమంది స్థానికులు ఆమెకు ఆర్థిక సాయమందించేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు స్థానికులు సేకరించిన రూ.2వేల విరాళాన్ని బాధితురాలి కుటుంబానికి మంగళవారం అందజేశారు. స్థానిక ప్రెస్ క్లబ్ సభ్యులు ఆమె కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరకులు ఇచ్చారు. బీసీ హాస్టల్‌లో పనిచేస్తున్న పల్లి శ్రీనివాస్ కొంత ఆర్థిక సాయమందించారు. కాగా నూకరత్నం భర్త ఇప్పటికే మెదడు సంబంధిత వ్యాధితోను, కొడుకు మానసిక వ్యాధితో బాధపడుతున్నాడని తెలిసి పలువురు సాయమందించారు. దాతల సాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి



డుంబ్రిగుడలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రేమ్‌సాగర్



కొయ్యూరులో మాట్లాడుతున్న ఎంఈవో రాంబాబు, సీడీపీవో విజయకుమారి



మారేడుమిల్లిలో మాట్లాడుతున్న ఎంఈవో ముత్యాలరావు



అడ్డతీగలలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరావు

డుంబ్రిగుడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అమలుచేసేందుకు జ్ఞాన జ్యోతి పేరుతో కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ సమన్వయంతో అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఈవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఐసీడీఎస్ సీడీపీవోలు తదితరులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. చిన్నారుల ఎదుగుదలకు ప్రీప్రైమరీ విద్య ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చిన్నారులకు నైతిక బాషా, మేధోభివృద్ధి, సృజనాత్మకత వృద్ధి చెందే విధంగా బోధించాలని సూచించారు. చిన్నారుల తల్లిదండ్రులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. డుంబ్రిగుడలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, ఎంఈవో శెట్టి సుందర్‌రావు, ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్, సీడీపీవో నీలిమ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, ఎంఈవోలు కృష్ణమూర్తి, రత్నకుమార్, సీడీపీవో వరహాలమ్మ, సీఆర్‌పీలు పుండరీ, మల్లికార్జున, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో లక్ష్మీదేవి, సూపర్‌వైజర్లు వలసమ్మ, రామలక్ష్మి, కృష్ణకుమారి, అధికారులు కుమార్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో ఎల్.రాంబాబు, సీడీపీవో విజయకుమారి, డీఆర్‌పీలు సురేష్‌కుమార్, తలుపులు, కనకమహాలక్ష్మి, బాలామణి, కొండమ్మ పాల్గొన్నారు.

గంగవరం(అడ్డతీగల): మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో సీహెచ్.లక్ష్మి, ఎంఈవో మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ –2 వి ముత్యాలరావు, సీడీపీవో ఎస్.ప్రసన్నవిశ్వనాథ్, డీఆర్‌పీలు జగజ్జీవన్, దేవప్రకాష్, జగదీశ్వరెడ్డి, సత్యనారాయణ, చిన్నసీత, రవళి తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో పి.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ పావని, డీఆర్‌పీలు నాగప్రసాద్, శ్రీను, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, ఎంఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.